క్లుప్తంగా

ఇంటింటికీ కుళాయి కనెక్షన్



మాట్లాడుతున్న ఏఈ కిరణ్

గోస్పాడు: ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ తాగునీరు అందించేందుకు కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేస్తుందని డీఈ మధుసూదన్, ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేకంగా జలజీవన్ మిషన్ కింద గ్రామాల్లో తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా ఎం.కృష్ణాపురం గ్రామానికి రూ.33.62లక్షలు, శ్రీరాంనగర్‌కు రూ.5.95లక్షలు, సాంబవరానికి రూ.31.50లక్షలు, పార్వతీపురానికి రూ.14.40లక్షలు, యాళ్లూరుకు రూ.79.90 లక్షలు మంజూరు మంజూరు కాగా వాటి పనులకు టెండర్లు కూడా పూర్తయ్యాయని, పనులు వెంటనే చేపడతామని చెప్పారు. మండలంలోని మిగిలిన గ్రామాలకు కూడా ప్రతిపాదనలు పంపామన్నారు. ఈఓఆర్డీ అనసూయ, ఏఈ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి జంప్‌రోప్ ఎంపిక పోటీలు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పిరమిడ్ పాఠశాలలో గురువారం జిల్లా స్థాయి జంప్ రోప్ ఎంపిక పోటీలు నిర్వహించినట్లు పాఠశాల ఏఓ హుసేన్‌బాషా తెలిపారు. కార్యక్రమానికి ఏపీ శాప్ ప్రెసిడెంట్ నిమ్మకాయల సుధాకర్, జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, జంప్ రోప్ జిల్లా సెక్రటరీ పక్కీరయ్య పాల్గొని పోటీలను ప్రారంభించారు.

విద్యుత్ బిల్లులు వసూలు చేయాలి

గోస్పాడు: వినియోగదారుల నుంచి విద్యుత్ బిల్లులు సకాలంలో వసూలు చేయాలని ఏఈ జ్ఞానసూర్యుడు సూచించారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని సూచించారు. గ్రామాల్లో వినియోగదారులకు బిల్లుల చెల్లింపుపై అవగాహన కల్పించి త్వరగా చెల్లించేలా చూడాలని తెలిపారు.

ఓటరుగా యాప్‌లో నమోదు చేసుకోవచ్చు

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాలో ఉన్న హిజ్రాలు స్థానిక సచివాలయం, ఓటరు హెల్ప్ లైన్ యాప్‌లో ఓటరుగా నమోదు చేసుకోవచ్చని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఫాతిమా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024లో రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు హిజ్రాలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

గోస్పాడు: ప్రభుత్వ భవన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఏఈ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రం లో చేపట్టే సచివాలయం, స్త్రీ శక్తి భవన నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో నూతన భవనాల నిర్మాణాలను చేపడుతున్నట్లు చెప్పారు.

రసాయన మందుల వాడకం అనర్థం

నంద్యాల(అర్బన్): అధికంగా రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం అనర్థదాయకమని, దీని ద్వారా పంటలకు మేలు చేసే మిత్ర పురుగులైన అల్లిక రెక్కల పురుగు, సాలిడ్, కందిరీగ, అక్షింతల పురుగులు మృతి చెందుతాయని నంద్యాల మండల ఏఓ ప్రసాదరావు తెలిపారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని అయ్యలూరులో గ్రామ సభ నిర్వహించారు. అంతకు ముందు వరి పంటను పరిశీలించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కాండం తొలుచు పురుగు నివారణకు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలుకల నివారణకు విషపు ఎరను పొలాల్లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ముక్తార్‌బాషా, వీఏఏలు షర్మిల, అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉశేన్‌స్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో వెలసిన ఉసేన్‌స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. గ్యార్మీ నెల నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాతోపాటు వైఎస్సార్, అనంతపురం తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో దర్గా భక్తులతో కిటకి టలాడింది. ఉసేన్ స్వామికి జెండాలు, పూలదట్టీలు, ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పేదల సొంతింటి కల సాకారం



కొలుములపేటలో మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల



చాగలమర్రి జగనన్న కాలనీలో ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల

చాగలమర్రి: నిరుపేద ప్రజల సొంతింటి కల ముఖ్యమంత్రి జగనన్నతోనే సాధ్యమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మండల స్థానిక కూలూరు రస్తాలోని జగనన్న కాలనీలో లబ్ధిదారులు జిగ్గిగారి ఖైరూన్‌బీ ప్రభుత్వ సహకారంతో నిర్మించుకున్న నూతన ఇంటిని ఎమ్మెల్యే, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ షేక్ బాబులాల్ గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న అధికారం చేపట్టినప్పటి నుంచి మండల కేంద్రంలో 5 జగనన్న లేఅవుట్లలో సుమారు 1500 మంది నిరుపేదలకు పట్టాలు పంపిణీ చేసి వారికి గృహనిర్మాణ శాఖ సహకారంతో ఇళ్ల నిర్మాణాలకు నిధులు విడుదల చేసిందన్నారు. ప్రస్తుతం దాదాపు 50 శాతానికి పైగా నిర్మాణాలు పూర్తయంయ్యాయన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి నియోజకవర్గంలో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సుయాత్రలో భాగంగా ఆళ్లగడ్డలో నిర్వహించే భారీ బహిరంగ సభకు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

జగనన్న పాలనలో సంతోషంగా ప్రజలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని చింతలచెరువు గ్రామ ఎస్సీ కాలనీ, కొలుములపేట గ్రామాల్లో జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్ షేక్ బాబులాల్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్ అందజేసి వారు పొందిన సంక్షేమ పథకాలను వివరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ వీరభద్రుడు, నాయకులు బీవీ సుబ్రహ్మణ్యం, వేంకటేశ్వర రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, హనుమంతురెడ్డి, గణపతిరెడ్డి, నరసింహారెడ్డి, సుమన్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జి.గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



ఎంపీ పోచాకు వినతి పత్రం ఇస్తున్న వడ్డెర సంఘం నాయకులు

నంద్యాల(వ్యవసాయం): వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం జాతీయ కార్యదర్శి శిల్పి సుబ్బరాయుడు, చల్లా వెంకటేష్, శివభాస్కర్, అశోక్ కోరారు. ఈ మేరకు గురువారం ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఇతర చేతి వృత్తుల వారి మాదిరిగానే వడ్డెర కుటుంబాలకు రూ.10వేలు ఆర్థిక సాయం ప్రకటించి ఆదుకోవాలన్నారు. కాంట్రాక్ట్ పనుల్లో 30శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. సుబ్బమ్మ, ప్రమిలమ్మ, రామసుబ్బమ్మ పాల్గొన్నారు.

వైద్యశాల అభివృద్ధికి కృషి



మనోహర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గంగుల

ఆళ్లగడ్డ: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడమే తమ లక్ష్యం అని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. స్థానిక వైద్యశాలలో ఫర్నీచర్, వైద్యశాలకు సంబంధించిన పరికరాల కొనుగోలుకు ఎమ్మెల్యే మిత్రుడు మనోహర్ రూ.12లక్షలు విరాళంగా ఇవ్వడంతో గురువారం సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 50 పడకల వైద్యశాలలో పరికరాల కోసం రూ.12లక్షలు ఇచ్చారన్నారు. అనంతరం మనోహర్‌ను సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

రూ.8కోట్లు మంజూరు

వైద్యశాలలో పెండింగ్ పనుల గురించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడి దృష్టికి తీసుకెళ్లగా ఆయన రూ.8కోట్లు మంజూరు చేశారని, అందుకు సంబంధించిన జీఓ ఈ రోజే విడుదలైందని చెప్పారు. ఈ నిధులతో కాంపౌండ్, ఆవరణలో సీసీరోడ్లు వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్, ఏపీఎన్జీఓస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, వైద్యశాల సూపరింటెండెంట్ సుజాత, వైద్యులు పాల్గొన్నారు.

పాడి రైతులకు పరిహారం

దొర్నిపాడు: మండలంలోని గుండుపాపల గ్రామానికి చెందిన ముగ్గురు పాడి రైతుల గేదెలు మూడు నెలల క్రితం విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. దీంతో చాకలి నడిపి మద్దిలేటికి రూ.1.60 లక్షలు, డొల్ల వెంగన్న, బోనాల పెద్దనరసింహుడుకు రూ.40 వేల చొప్పున విద్యుత్ శాఖ అధికారులు బ్యాంకు ఖాతాల్లో జమ చేశారని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి గురువారం తెలిపారు. పరిహారం అందేందుకు సహకరించిన ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

అవినీతి నిర్మూలన అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): అవినీతి నిర్మూలనను అందరూ బాధ్యతగా తీసుకొని అంతమొందించాలని పవర్ గ్రిడ్ నంద్యాల జిల్లా కన్‌స్ట్రక్షన్ ఏరియా ఆఫీసర్ చౌహాన్ పిలుపునిచ్చారు. విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా గురువారం క్రాంతినగర్‌లోని మోడల్ స్కూల్ ఆవరణలో అవినీతి నిర్మూలనకు సంబంధించిన ప్లకార్డులను పవర్‌గ్రిడ్ సిబ్బందితో కలిసి ప్రదర్శించారు. అంతకు ముందు అవినీతిని నిర్మూలించాలంటూ బొమ్మలసత్రం నుంచి రైతునగరం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీజీఎం రాజగోపాల్, మేనేజర్ సాయితేజ, రాజేంద్ర, విష్ణు, మహేష్ పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం



ల్యాబ్‌లో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

నంద్యాల టౌన్ : జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ హెల్త్ క్లినిక్ వంటి వినూత్న కార్యక్రమాలతో రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకెళ్తోందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ వైద్యం కోసం ప్రజలకు ప్రయాసలు పడకుండా, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారికి ఉత్తమ వైద్యసేవలందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్పొరేట్ సేవలు సైతం పేదలకు అందేందుకు ఆరోగ్యశ్రీ సేవలను మరింత విస్తృతం చేశారని చెప్పారు. అనంతరం శిబిరం పరిధిలో ఎన్ని కుటుంబాలున్నాయి, ఎందరిని సర్వే చేశారు, ఎంత మందికి టోకెన్లు ఇచ్చారు, ఎక్కువగా ఏయే అనారోగ్య సమస్యలు గుర్తించారు, అవసరం మేరకు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను, అత్యవసర కేసులను ఉన్నత వైద్యానికి నెట్ వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారా వంటి అంశాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కౌంటర్లలో, వివిధ వైద్య విభాగాల్లో వైద్యులు ఆయా వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు, వైద్య సేవలు సంతప్తి కరంగా ఉన్నాయా అని శిబిరానికి వచ్చిన ప్రజలను ఆరా తీశారు. మున్సిపల్ చైర్పర్సన్ మబున్నిసా , వైద్య, అంగన్‌వాడీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం 618 మందికి వైద్య సేవలందించగా వీరిలో ఆరుగురిని ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులకు రెఫర్ చేశారు.

కొనసాగుతున్న ఫెన్సింగ్ పోటీలు



రెండో రోజు పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్పీజీ క్రీడా మైదానంలో అండర్–19 ఫెన్సింగ్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండవ రోజు కొనసాగాయి. గురువాం నాటి పోటీలను ఎస్పీజీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీవలత ప్రారంభించారు. పీఈటీల సంఘం కార్యదర్శి బత్తుల రవికుమార్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్, స్టేట్ కో ఆర్డినేటర్ విశ్వనాథ్, కోచ్ మహేశ్వరరావు పాల్గొన్నారు. డీఈఓ సుధాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు 13 ఉమ్మడి జిల్లాల క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేశారు.

మామిడి రైతులకు అవగాహన



రుద్రవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న నరేంద్రరెడ్డి

రుద్రవరం: మామిడి తోటల్లో మెళకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని హార్టికల్చర్ అధికారి నరేంద్రరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ పథకం సిబ్బంది మామిడి రైతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానవన అధికారి మాట్లాడుతూ జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్,మే నెలల్లో తోటలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. మామిడి చెట్లు పచ్చి పూత దశలో ఉన్నప్పుడు నీటి తడులు,పిచికారీ చేయాల్సిన మందులపై అవగాహన కల్పించారు.అలాగే నీటి ఎద్దడి ఉన్నప్పుడు, పిందె సైజులో ఉన్నప్పుడు అవి రాలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మామిడి కాయల కోతలకు 40 రోజుల ముందే నీటి తడులు నిలిపేయాలని, కాయలు కోసిన 8గంటల లోపు శీతల గిడ్డంగులకు చేర్చాలని చెప్పారు. ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి,ఏపీఓ ప్రతాప్,ఎఫ్ఏలు, టీఏలు, ఈసీ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థితో ఉపాధ్యాయులు

రుద్రవరం: మండలంలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన భరత్ అనే విద్యార్థి ఎస్‌జీఎఫ్–19లో ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. గురువారం పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావుతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. గత నెల 25న కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫె డరేషన్) అండర్–19 కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ చెప్పారు. ఈ నెల 4,5, 6 తేదీల్లో ఈస్ట్ గోదావరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో కర్నూలు జట్టు తరపున పాల్గొంటాడని పేర్కొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ భవన పనులు పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

నంద్యాల(అర్బన్): అసంపూర్తిగా ఉన్న నంద్యాల తహసీల్దార్ కార్యాలయాన్ని మరమ్మతులు చేపట్టి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పంచాయతీరాజ్ ఎస్ఈ రామ్మోహన్‌ను ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో అసంపూర్తిగా ఉన్న కార్యాలయ భవనాన్ని కలెక్టర్ పరిశీలించి మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయంలో అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే చేపట్టి త్వరగా పూర్తి చేయాలన్నారు. సైడ్ వాల్స్, ఫ్లోరింగ్, విద్యుత్ తదితర పనులను నాణ్యతలో రాజీ పడకుండా చేయాలన్నారు. జిల్లా మినరల్ ఫండ్ కింద మంజూరైన రూ.25లక్షలతో అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. నిబంధనల ప్రకారం టెండర్లు ఖరారు చేసి పనులు అప్పగించాలన్నారు. నంద్యాల తహసీల్దార్ శ్రీనివాసులు, పంచాయతీరాజ్ డీఈ, ఏఈలు ఉన్నారు.

ఆర్టీసీ ప్రయాణం క్షేమం, ప్రయోజనం



లక్కీ డిప్ ద్వారా విజేతలను ప్రకటిస్తున్న నంద్యాల డిపో మేనేజర్ గంగాధర్

నంద్యాల టౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణించడం ద్వారా క్షేమంగా గమ్య స్థానాలకు చేరడమే కాకుండా ఆర్టీసీ ప్రవేశ పెట్టే వినూత్న స్కీంలలో పాల్గొని లాభదాయకమైన ప్రయాణంగా మార్చుకోవచ్చని నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్ తెలిపారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నంద్యాల–రుద్రవరం మార్గంలో తిరుగుతున్న 6 బస్సుల్లో ఏర్పాటు చేసిన గిఫ్ట్ స్కీం విజేతలను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేశారు. ఇందులో శిరివెళ్ల గ్రామానికి చెందిన నాగన్నకు మొదటి బహుమతి, రుద్రవరం గ్రామానికి చెందిన కే. చరితకు రెండో బహుమతి, ఇదే గ్రామానికి చెందిన కళావతికి మూడో బహుమతి లభించిందని చెప్పారు. గెలుపొందిన వారు డిపోలోని అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్)ను సంప్రదించాలని సూచించారు.

మహానందీశ్వర దంపతులకు ఏకాంతసేవ



ఏకాంతసేవ పూజలందుకున్న మహానందీశ్వర దంపతులు

మహానంది: శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి దంపతులకు గురువారం రాత్రి ఏకాంతసేవ పూజలు వైభవంగా జరిగాయి. వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో పండితులు శాంతారాంభట్, హనుమంతశర్మలు స్వామి,అమ్మవారి ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం యాగశాలలో శాస్త్రోక్తంగా వేదమంత్రాల మధ్య పూజలు చేశారు. భక్తులు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకున్న అనంతరం పండితులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

కృత్రిమ అవయవాల కోసం పేర్లు నమోదు చేసుకోండి

జూపాడుబంగ్లా: కృత్రిమ అవయవాలకోసం విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు పేర్లు నమోదు చేయించుకోవాలని ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ 10న ఎల్లేన్ మెడోస్ ప్రాస్తెటిక్ హ్యాండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా మంగళగిరిలో కృత్రిమ అవయవాల పంపిణీ శిబిరం నిర్వహించనున్నారని చెప్పారు. చేతులు, కాళ్లు కోల్పోయిన వారు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు వారికి అవసరమైన ఎల్ఎన్ 4 కృత్రిమ అవయవాలకోసం 7207403150 నంబర్‌కు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకొన్న ఎల్ఎల్4 అవయవాలు ధరించటం వల్ల దివ్యాంగులు వారి పనులను స్వతహాగా చేసుకోగలుగుతారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయలయ్యాయి. 108 అంబులెన్స్ సిబ్బంది సమాచారం మేరకు.. రుద్రవరం మండలం నరసాపురం గ్రామానికి చెందిన మహబూబ్‌వలీ, ములాన్‌బీ దంపతులు కోవెలకుంట్ల మండలం రేవనూరు ఉసేన్‌స్వామి దర్గాను దర్శించుకుని బైక్‌పై తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. కలుగొట్ల సమీపంలో బైక్ అదుపు తప్పి బోల్తాపడి వారు గాయపడగా స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్స్ సిబ్బంది నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో బాలాలయ ప్రతిష్ఠ



ఆలయంలో పూజలు చేస్తున్న వేదపండితులు

బనగానపల్లె : మండలంలోని నందవరం శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో గురువారం బాలాలయ ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈఓ రామానుజన్, వేదపండితులు అనుజ్ఞ, గణపతి పూజ, యాగసంకల్పం, మహాశాంతి, ప్రాయిచిత్త హోమం, దేవి మూలమన్ర పంచసూక్తి హోమం, పూర్ణహుతి కళాపకర్షం అనంతరం బాలాలయప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పీఆర్ మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్హతలేకున్నా హెవీ డ్రైవింగ్ లైసెన్స్

ఆత్మకూరు: డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో లైట్ లైసెన్స్ కలిగి హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ అవసరమైన వారికి ఎలాంటి విద్యార్హత లేకున్నా మంజూరు చేస్తామని ఆర్టీఓ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఎలాంటి చదువు లేకున్నా ఎల్ఎల్ఆర్ హెవీవెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ అందిస్తామన్నారు. టూ వీలర్, ఫోర్ వీలర్స్ లైసెన్స్‌ను కూడా ఎలాంటి చదువు అర్హతలేకుండా లైసెన్స్ మంజూరు చేస్తామని చెప్పారు. హెవీ వెహికల్ లైసెన్స్ కావాల్సిన వారు ఆర్టీఓను కలిసి దరఖాస్తులు అందించాలన్నారు. ఏజెంట్ల ద్వారా ఎవరూ రావద్దని, స్వయంగా లేదా మీసేవలో దరఖాస్తు చేసుకుని ఆర్టీఓ కార్యాలయానికి రావాలని సూచించారు.

దేవస్థానం ఆసుపత్రికి మందుల విరాళం



మందులను అందజేస్తున్న దాత

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న దేవస్థానం ఆసుపత్రికి హైదరాబాద్‌కు చెందిన చిలకల ఉపేందర్ రెడ్డి, కపిల్‌రెడ్డి రూ.2,12,000 లు విలువచేసే మందులను విరాళంగా అందజేశారు. ఈ మందులను ఏసీ వెంకటేశ్వర్లుకు, జి.మల్లికార్జునకు అందజేశారు.

నాటుసారా స్వాధీనం

మహానంది: బొల్లవరం గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న పాములేటిని అరెస్ట్ చేసి, పది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు చేపట్టి పాములేటిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయ స్వామి

శ్రీశైలంటెంపుల్ : లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను ఈఓ , అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గా వించారు. అనంతరం భక్తులు దర్శించుకున్నారు.

ఆరుగురిపై బైండోవర్ కేసులు

మహానంది: గాజులపల్లెకు చెందిన ఆరుమందిపై గురువారం బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఇటీవల గాజులపల్లె, బుక్కాపురం, తిమ్మాపురం , అబ్బీపురం, సీతారామాపురం గ్రామాలకు చెందిన సుమారు ఇరవై మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.